

నేడు మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

అరసవల్లి, ఫిబ్రవరి 4: ముఖ్యమంత్రి జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం నగరంలోని డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్టు యూనియన్ గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి తెలిపారు. కార్మికులకు వేతనం రూ.10వేలతోపాటు ఐడీ కార్డులు ఇవ్వాలని, మెనూచార్జీలు పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏడాదికి రెండు జతల యూనిఫారాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్మికులంతా పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆ స్థలం మాదే!

ముక్తింపురం కొండభూమిలో రెండేళ్ల కిందట వేసిన ప్లాట్లు



- ముక్తింపురంలో కొండభూమి వివాదం
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో రెండు సామాజికవర్గాల మధ్య రణం
- రెండున్నరేళ్ల కిందట 200 మందికి ప్లాట్లు
- ప్రభుత్వమే అనుమతిచ్చినట్టు కలరింగ్
- తెరవెనుక అధికారపార్టీ నేతలు
- అప్పట్లో పట్టించుకోని అధికారులు
- తాజాగా ఇరువర్గాల మధ్య కొట్లాట

(రణస్థలం)

ఎక్కడైనా ప్రభుత్వ భూమిని సర్కార్ సంరక్షించి.. ప్రజోపయోగ పనులకు కేటాయిస్తుంది. కానీ అక్కడ మాత్రం అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరించింది. ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు ప్రయత్నించినా పట్టించుకోలేదు. ఇప్పుడు అదే నిర్లక్ష్యం రెండు సామాజికవర్గాల మధ్య వివాదానికి దారి తీసింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రణస్థలం మండలం ముక్తింపురంలో సర్వే నంబర్ 58లోని 76 ఎకరాల్లో కొండ పోరంబోకు భూమి ఉంది. ఇక్కడ ఎకరా రూ.3 కోట్లకుపైగా పలుకుతోంది. ఈ భూమి పక్కనే ప్రైవేట్ లేఅవుట్‌లు వెలిశాయి. ఇక్కడ సెంటు ధర రూ.3లక్షలు. మూడున్నర సెంట్ల ఇంటి ప్లాట్ రూ.10.50 లక్షలకు విక్రయిస్తున్నారు. దీంతో కొండ పోరంబోకు భూమిపై కొంతమంది అధికారపార్టీ నేతల కన్నుపడింది. రెండున్నర ఏళ్ల కిందట కొండ దిగువ ప్రాంతంలో 15 ఎకరాలు చదును చేసి.. గ్రామంలో నిరుపేదల పేరిట ప్లాట్లను విభజించారు. ప్రభుత్వం నుంచి కానీ, అధికారుల నుంచి కానీ ఎటువంటి అనుమతులు తీసుకోలేదు. మొత్తం 200మందికిపైగా ప్లాట్లు కట్టబెట్టారు. అనధికారికంగా ఈ ప్లాట్ మీది అంటూ లబ్ధిదారులకు చూపించారు. ప్రభుత్వం ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్టు కలరింగ్ ఇచ్చారు. సీన్ కట్ చేస్తే.. ఇప్పుడు అదే ప్లాట్లను ఆదివారం ఓ సామాజికవర్గం స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేసింది. హద్దులను తొలగించి ఇది మాకు ప్రభుత్వం సాగు చేసుకునేందుకు ఇచ్చిందని.. దీనిని ప్లాట్లుగా విభజించి ఎలా సర్దుబాటు చేసుకుంటారని ఆ సామాజికవర్గం వారు ప్రశ్నించారు. అయితే దీనిపై మరో సామాజికవర్గం వారు తమకు గొర్రెలు, పశువులు పెంపకానికి, మేతకు ఈ కొండ ప్రాంతం ఉందని.. మీరెలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. దీంతో ఘర్షణ చోటుచేసుకోగా.. ఇరువర్గాలకు చెందిన పలువురు స్వల్పంగా గాయపడ్డారు. దీంతో జేఆర్‌పురం పోలీసు స్పందించారు. ఇది ప్రభుత్వ భూమి అని.. గొడవపడితే కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గాయపడిన వారు శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు.

● చేతులు మారిన రూ.కోట్లు

కొండపోరంబోకు భూముల వ్యవహారంలో కోట్లాది రూపాయలు చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నర్సరీలో భాగంగా అప్పటికే ఆ భూమిలో అటవీ శాఖ నీలగిరి, ఆకేసు చెట్లు పెంచుతూ వస్తోంది. ఈ భూమిని స్వాధీనం చేసుకోవాలన్నా, ప్రజావసరాలకు వినియోగించాలన్నా అటవీ శాఖ అనుమతి అవసరం. పంచాయతీ అప్రూవల్ సైతం తీసుకోవాలి. కానీ ఏడాదిన్నర కిందట ఏ అనుమతులు తీసుకోకుండా చెట్లు నరికించి ప్లాట్లుగా విభజించడం చర్చనీయాంశమైంది. స్థలం చదును నెపంతో లబ్ధిదారుల నుంచి పెద్దఎత్తున వసూలు చేసినట్టు తెలుస్తోంది. ప్రభుత్వ అనుమతి లేకుండా, అటవీ శాఖ స్వాధీనంలో ఉన్న భూమిని ఎలా స్వాధీనం చేసుకున్నారన్నది ప్రశ్నార్థకం. ఇలా ప్లాట్లుగా విభజించిన ఆస్తి విలువ రూ.45కోట్లు ఉంటుంది. అందుకే ఇది వివాదాస్పదమవుతోంది.



వివాదంపై ఇరువర్గాలతో చర్చిస్తున్న పోలీసులు

● బోర్డులు పాతిన అధికారులు

అప్పట్లో భూ భాగోతం విషయం వెలుగులోకి రావడంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ఆ భూములను పరిశీలించారు. కొండపోరంబోకు భూమిగా గుర్తించారు. అక్రమంగా లేఅవుట్లు వేసినట్టు నిర్ధారించారు. వెంటనే ఇది ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ ఆక్రమిస్తే శిక్షార్హులు అంటూ బోర్డులు పెట్టారు. తరువాత దాని గురించే మరచిపోయారు. దీంతో యథావిధిగా ఆక్రమణలు కొనసాగుతునే ఉన్నాయి. ఇవి ప్రభుత్వం తమకు కేటాయించిన స్థలాలుగా అక్కడ లబ్ధిదారులు నమ్ముతూ వచ్చారు. కానీ ఇది తమకు ప్రభుత్వం కేటాయించిన భూమి అని ఓ సామాజికవర్గం చెబుతుండగా.. అభ్యంతరం వ్యక్తం చేస్తూ మరో సామాజికవర్గం తెరపైకి రావడంతో వివాదాస్పదంగా మారింది. ఏకంగా కొట్లాటకు దారితీసింది. కేవలం ప్రభుత్వం, రెవెన్యూ అధికారుల ఉదాసీనతతోనే ఇలా జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదివారం రాత్రి సీఐ రామచంద్రరావు, ఎస్ఐ గోవిందరావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వివాదం గురించి ఆరాతీశారు. సంయమనం పాటించాలని సూచించారు.

అసలైన వారు ఏరీ?

- జగనన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లకు లబ్ధిదారులు కరువు
- చాలాచోట్ల స్థలాల విక్రయాలు
- పట్టాదారులను గుర్తించేందుకు అధికారుల పాట్లు
- ఎన్నికల వేళ.. ఇదో డ్రామా అంటున్న ప్రజలు



ఇది టెక్కలి దరి జగతిమెట్టలోని జగనన్న ఇళ్ల కాలనీ లేఅవుట్. ఇక్కడ అధికారులు సుమారు 380 స్థలాలను కేటాయించారు. ఆ స్థలాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టగా.. అసలైన లబ్ధిదారులు కరువయ్యారు. చాలామంది స్థలాలను విక్రయించడంతో.. రిజిస్ట్రేషన్లకు ముందుకు రావడం లేదు. మరోవైపు అధికారపార్టీ నేతల ఒత్తిడితో లబ్ధిదారుల పరిశీలన ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.



(టెక్కలి)

ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన వారి ఓట్లకు అధికారపార్టీ వల వేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా రూపాయికే జగనన్న ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇటీవల సచివాలయాల్లో ప్రారంభించింది. కాగా.. దీనిపై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. ఇన్నాళ్లు గృహ నిర్మాణదారుల గోడును పట్టించుకోని ప్రభుత్వం.. ఇప్పుడు హఠాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల వేళ ఇదో డ్రామా అంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు చాలామంది ఇళ్ల స్థలాలు విక్రయించడంతో.. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అసలైన లబ్ధిదారులు దొరక్క అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో సుమారు 834 జగనన్న ఇళ్ల కాలనీ లేఅవుట్లు వేశారు. అందులో వివిధ దశల్లో 54,996 మందికి పట్టాలు అందజేశారు. 43,229 ఇళ్లకు గాను ఆయా శాఖల అధికారులు మ్యాపింగ్ కూడా చేశారు. అందులో 34,854 ఇళ్లకు సంబంధించి సరిహద్దులు గుర్తించారు. అయితే రిజిస్ట్రేషన్ కోసం వెరిఫికేషన్ అధికారులు పలుచోట్లకు వెళ్లగా.. లబ్ధిదారుల వివరాలను గుర్తించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇచ్చిన స్థలాలను చాలా మంది లబ్ధిదారులు ఇతరులకు విక్రయించారు. దీంతో పట్టాలు పొందిన లబ్ధిదారులు దొరక్కపోవడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. టెక్కలిలోని జగతిమెట్ట సమీపంలో జగనన్న లేఅవుట్లలో పట్టా ఒకరిది.. లబ్ధిదారులు మరొకరు. దీనిపై అప్పటి సబ్‌కలెక్టర్ దర్యాప్తు నిర్వహించారు. వారందరికీ రెవెన్యూ అధికారులతో నోటీసులు కూడా జారీ చేయించారు. ఈ మేరకు నివాసమున్న కొందరికి ఎల్‌పీసీలు జారీ చేస్తున్నారు. మొత్తంగా జగతిమెట్ట లేఅవుట్‌లో జరిగిన అక్రమాలను అధికారులను గుర్తించినా.. అప్పట్లో అధికారపార్టీ రాజకీయ ఒత్తిళ్లతో ఆ వ్యవహారం నీరుగారింది. ఈ విషయమై జేసీ ఎం.నవీన్‌కుమార్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా జగనన్న ఇళ్ల కాలనీ లేఅవుట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. జిల్లాలో టెక్కలిలోని జగతిమెట్ట లేఅవుట్‌లో లబ్ధిదారులు కొందరు స్థలాలు విక్రయించినట్టు ఫిర్యాదులు అందాయని తెలిపారు.

ఓట్ల గాలమే..

గృహ నిర్మాణాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.1,50,000 అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మెటీరియల్ రూపంలో రూ.30వేలు మాత్రమే మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం సాయంతో కలిపి మొత్తంగా తామే అందిస్తు న్నట్లు వైసీపీ సర్కారు ఇంతకాలం చెప్పుకొచ్చింది. అయినప్పటికీ అనేకమంది లబ్ధిదారులకు గృహ నిర్మాణాలకు వెనకడుగు వేశారు. చాలీచాలని స్థలాల్లో.. అప్పులు చేసి ఇళ్ల నిర్మాణలు చేపట్టలేక చేతులెత్తేశారు. కాగా నిర్మాణాలు చేపట్టకుంటే.. పట్టా రద్దు చేస్తామని, స్థలాన్ని మరొకరికి కేటాయిస్తామని ఉన్నతాధికారులు బెదిరించడంతో.. కొంతమంది ముందుకొచ్చారు. కూలీలు, గృహ నిర్మాణ మెటీరియల్ ధరలు ఆకాశన్నంటడంతో ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు రూ.8 లక్షలు కూడా సరిపోని పరిస్థితి. దీంతో చాలామంది లబ్ధిదారులు అప్పుల ఊబిలో కూరుకు పోయారు. మరికొంతమంది మధ్యలోనే పనులను నిలిపేశారు. మరోవైపు లేఅవుట్లలో మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో ఆయా లబ్ధిదారులు కూడా వైసీపీ ప్రభుత్వానికి రివర్స్ అయ్యే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. వీరిని మభ్యపెట్టేందుకు వైసీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల నాటకం ఆడుతోందని ప్రతిపక్షాల నాయకులు విమర్శిస్తున్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన పదేళ్ల తర్వాత ఆ స్థలాన్ని వేరొకరికి విక్రయించుకొనే హక్కు కలుగుతుందని ప్రభుత్వం వెల్లడిస్తుండగా.. లబ్ధిదారులకు వచ్చే లాభం ఏమీ ఉండదని ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు. పట్టాలు మంజూరు చేసిన తర్వాత స్థలాలపై సర్వ హక్కులు ఇళ్ల లబ్ధిదారులకు ఉంటుంది. వారి తదనంతరం వారసులకు ఆ హక్కు ఉంటుంది. కొత్తగా వైసీపీ ప్రభుత్వం కల్పించే హక్కు ఏమిటో అర్థం కావడం లేదని, ఈ రిజిస్ట్రేషన్ పేరిట ప్రభుత్వం లబ్ధిదారుల ఓట్లకు గాలం వేస్తోందని ప్రతిపక్షాలు సైతం విమర్శలు గుప్పిస్తున్నాయి.

అందని సున్నావడ్డీ



- రెండేళ్లుగా ఖాతాలకు జమకాని నగదు
- అన్నదాతలకు తప్పని ఎదురుచూపులు

(ఇచ్ఛాపురం రూరల్)

అన్నదాతలకు సున్నావడ్డీ నగదు కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. రైతులు అప్పుల ఊబిలో చిక్కుకోకుండా సంస్థాగత రుణాలు అందించడం, పెట్టుబడి ఖర్చులు తగ్గిస్తూ ఆర్థిక వెసు లుబాటు అందించడమే వైఎస్సార్ సున్నావడ్డీ పథకం లక్ష్యం. అయితే జిల్లాలో రెండేళ్లుగా వడ్డీమాఫీ డబ్బులు అందకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రుణం సకాలంలో చెల్లించినా, వడ్డీ డబ్బులు జమ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ పాలనలో రైతులకు సున్నావడ్డీ రా యితీ తక్షణమే జమయ్యేది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సున్నా వడ్డీ రాయితీ సకాలంలో అందడం లేదు. రెండేళ్లుగా రాయితీ నగదుకు దిక్కులేదు. టీడీపీ హయాంలో కన్నా.. అధిక మొత్తంలో సాయం చేస్తామంటూ సీఎం జగన్ ప్రకటించారు. చివరకు రూ.లక్షకు కుదించారు. ఏటా వడ్డీ చెల్లించి రైతులను ఆదుకోవాల్సి ఉండగా కేంద్రం రాయితీతో సరిపెడుతూ రైతులను వంచిస్తున్నారు. 2019-20 ఖరీఫ్‌లో జిల్లాలో 1,57,249 మంది రైతులకు రూ.26.56 కోట్లు, 2020-21లో 1,22,769 మంది రైతులకు రూ.15.57కోట్లు, 2021 ఖరీఫ్‌లో 59,726మంది రైతులకు రూ.9.78కోట్లు చెల్లించనట్లు జిల్లా వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. సున్నావడ్డీ రాయితీ 2021 రబీ, 2022 ఖరీఫ్, రబీ, 2023 ఖరీఫ్ సీజన్లకు సంబంధించి వేల సంఖ్యలో రైతులకు రూ.కోట్లలో బకాయిలు ఉన్నట్లు సమాచారం.

కేంద్రం యథావిధిగా..

రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతులకు వడ్డీ మాఫీ వర్తిస్తుంది. దీనికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రాయితీ కిసాన్ క్రెడిట్ కార్డు పథకం నిబంధనలకు అనుగుణంగా అర్హత ప్రమాణాలు విధించారు. ఆమేరకు రైతుల బ్యాంకు ఖాతాలకు ఏటా పంట సీజన్ ముగిసే సమయానికి ఇవి జమకావాలి. పంట రుణాలపై సున్నా వడ్డీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం నాలుగు శాతం వడ్డీ చెల్లించాలి. ఇలానే రూ.3లక్షల లోపు రుణం తీసుకుని ఏడాదిలోగా చెల్లిస్తే ప్రాంప్ట్ రీపే మెంట్ సున్నావడ్డీ పేరుతో కేంద్ర ప్రభుత్వం వెంటనే వారి ఖాతాలో మూడు శాతం నగదు జమ చేయాలి. కేంద్ర ప్రభుత్వం యథావిధిగా వడ్డీ డబ్బులు జమ చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సకాలంలో చెల్లించడం లేదని రైతులు వాపోతున్నారు. రైతుల జాబితా ఆర్‌బీకేలో ప్రదర్శించడం, సామాజిక సర్వే తదితర పనులతో కాలయాపనే తప్ప సకాలంలో రాయితీ అందడం లేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు జాబితా..

రెండేళ్లుగా రైతులకు సున్నావడ్డీ అందని విషయం వాస్తవమే. వాటికి సంబంధించిన జాబితాను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించాం. ఈ నెల మొదటి వారం లేక రెండో వారంలో జమయ్యే అవకాశం ఉంది.

-కె.శ్రీధర్, వ్యవసాయశాఖ జేడీ, శ్రీకాకుళం

పోరాటాలతోనే.. సమస్యలకు పరిష్కారం

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

శ్రీకాకుళం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): 'సమరశీల పోరాటాలతోనే విద్యారంగాన్ని కాపాడుకోవాలి. విద్యారంగ అభివృద్ధితోనే దేశ ఆర్థిక సంస్కృతి, నాగరిక అంశాలు ముడి పడి ఉన్నాయ'ని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పేర్కొన్నారు. ఆదివారం శ్రీకాకుళం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ఏపీటీఎఫ్ జనరల్ కౌన్సెల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శాస్త్రీయమైన విద్యారంగ అభివృద్ధి ధ్యేయంగా ఏపీటీఎఫ్ పనిచేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి మాట్లాడుతూ విద్యారంగం సంక్షోభంలో ఉందని, పోరాట స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ మాట్లాడుతూ బాధ్యతల పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తూనే.. హక్కుల కోసం పోరాడాలని పేర్కొన్నారు. గత రెండేళ్లలో విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వ తీరుపై ఏపీటీఎఫ్ ఉద్యమం కొనసాగిస్తోందన్నారు.

● అనంతరం ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా మజ్జి మదన్‌మోహన్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్వీ అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పి.అప్పలనాయుడు, బి.డిల్లీశ్వరరావు, జి.భీమారావు, టి.రాజ్యలక్ష్మి, కె.గోపీకృష్ణ, బి.నేతాజీరావు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా చావలి శ్రీనివాస్, ఎస్.చాణక్య, వి.నవీన్‌కుమార్, డి.రామ్మోహన్‌రావు, ఎం.గంగేశ్వరి, పి.తిరుమలరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా బి.సుభాష్‌బాబు, పి.శ్రీరామమూర్తి, డి.చంద్రశేఖర్, ఎస్.శ్రీనివాసరావు, బి.అప్పలనాయుడు, జి.రాజేష్, కె.విజయ్‌కుమార్, బి.శాంతి, ఎన్.నీలామోహన్, కె.శాంతారామ్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టి.సూర్యనారాయణ, సభ్యులుగా పలువురు ఉపాధ్యాయులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.త్రినాథరావు, రాష్ట్ర పరిశీలకులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి వ్యవహరించారు. ఎన్నిక అనంతరం నూతన జిల్లా కార్యవర్గం ప్రమాణం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

మితిమీరిన వేగంతో..

- పోర్టు వాహనాల రాకపోకలతో ప్రమాదాలు
- భయాందోళనలో ప్రజలు

టెక్కలి రూరల్, ఫిబ్రవరి 4: టెక్కలిలో పోర్టు వాహనాలు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తూ.. ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆదివారం ఈ వాహనాల కారణంగా రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. నిబంధనలు పాటించాలని వాహన యాజమానులకు, డ్రైవర్లకు ఎప్పటికప్పుడు పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక గోపినాథపురం సమీపంలో ఆదివారం సాయంత్రం మూలపేట పోర్టుకు చెందిన ఓ లారీ ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. దీంతో కారు ముందుభాగం దెబ్బతింది. కారులో ఉన్నవారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన జరిగిన మూడు గంటల వ్యవధిలోనే మరో ప్రమాదం జరిగింది. స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద ఒక ద్విచక్రవాహనాన్ని.. మూలపేట నుంచి రాంగ్‌రూట్‌లో ఎదురుగా వచ్చిన ఒక పోర్టు వాహనం బలంగా ఢీకొంది. బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో పోర్టువాహనం ముందు టైర్ల కిందకు ద్విచక్రవాహనం దాదాపు వెళ్లిపోయింది. ఈ ఘటనతో స్థానికులు, వాహనదారులు ఉలిక్కిపడ్డారు. ఏం ఘోరం జరిగిందోనని అంతా గుమిగూడిపోయారు. ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. పోర్టు వాహనాన్ని అడ్డుకుని డ్రైవర్‌కు చీవాట్లు పెట్టారు. కొద్ది సమయం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోర్టు వాహనాల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. టెక్కలిలో పోర్టు వాహనాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడుతుందని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వాహనాలు వేగానికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



టెక్కలిలో పోర్టు వాహనాన్ని అడ్డుకున్న స్థానికులు

డివైడర్‌ను ఢీకొని పాలవ్యాన్ బోల్తా

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీ కొని పాలవ్యాన్ బోల్తాపడింది. ఆ వ్యాన్‌ను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం స్థానిక పాతబస్టాండ్ మీదుగా ఏడురోడ్లకూడలి వైపు పాలవ్యాన్ అతివేగంగా వెళ్తూ.. ముందువెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని క్రాస్ చేస్తూ రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఆ వ్యాన్‌ను ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న సైరిగాపు హరిప్రసాద్ రోడ్డు మీద పడడంతో గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో ఆయనను జీజీహెచ్(రిమ్స్)కు తరలించారు. ట్రాఫిక్ ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాలవ్యాన్‌ను ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.



శ్రీకాకుళంలో బోల్తా పడిన పాలవ్యాన్

విస్తృతంగా పల్లె పల్లెకు టీడీపీ, బాబు ష్యూరిటీ

టీడీపీ అధిష్ఠానం పిలుపు మేరకు గ్రామాల్లో పల్లె పల్లెకు టీడీపీ, బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలు, టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాల్సిన అవశ్యకతపై ప్రజలకు చైతన్యం చేశారు.



పలాస: మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు



సంతబొమ్మాళి: మాట్లాడుతున్న తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

పలాస, ఫిబ్రవరి 4: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టీడీపీ నాయకులు అన్నారు. వార్డు వార్డుకు టీడీపీ కార్యక్రమాన్ని ఆదివారం రైల్వే కాలనీ, పెద్ద వీధుల్లో చేపట్టారు. ఈ సందర్భంగా వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ.. టీడీపీ అధికారం లోకి రావాల్సిన ఆవశ్యకత ఉందని, చంద్రబాబును మళ్లీ సీఎంగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు బడ్డ నాగరాజు, యవ్వారి మోహన రావు, జోగ మల్లి, జ్యోతినాయక్, డిక్కల ఆనంద్, ఎస్.గోవిందరావు, మధు, శ్రీను, కేదార్ పాల్గొన్నారు.

● **పెద్దకొల్లివలస(ఎల్.ఎన్.పేట):** రాష్ట్రంలో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి అన్నారు. పెద్ద కొల్లివలస పంచాయతీలో ఆదివారం ఇంటింటికి వెళ్లి వైసీపీ అరాచకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్య క్రమంలో నాయకులు కె.చిరంజీవి, ఎస్.కిషోర్‌కుమార్, వి.ఆనందరావు, ఎన్.నారాయణరావు, ఎస్.తేజేశ్వరరావు, జి.గణేశ్, గోవిందరావు, జి.రాము తదితరులు పాల్గొన్నారు.

● **సంతబొమ్మాళి:** రానున్న ఎన్నికల్లో టీడీపీకి జిల్లాలోనే సంతబొమ్మాళి మండలంలో అత్యధిక మెజార్టీ సాధించాలని జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు అన్నారు. ఆది వారం వడ్డితాండ్రలో పర్యటించారు. టీడీపీ హయంలో సంతబొమ్మాళి మండలం మౌలిక సదు పాయాలు కల్పించారన్నారు. మండలంలో ప్రతి ఎన్నికల్లో టీడీపీకి, కింజరాపు కుటుంబానికి అండగా ఉంటోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అట్టాడ రాంప్రసాద్, అట్టాడ తిరుపతిరావు, ఆరంగి వసంతరావు, కర్రి విష్ణుమూర్తి, సువ్వారి ప్రసాద్, పంగ అశిరినాయుడు పాల్గొన్నారు.

● **హరిపురం:** టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలతో పిల్ల ల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. హంసరాలి పంచాయతీలోని పలు గ్రామాల్లో ఆదివారం పల్లెపల్లెకు టీడీపీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రట్టి లింగరాజు, దాసరి తాతారావు, తమిరి భాస్కరరావు, సవర లఖియా, మిస్క గణపతి, లక్ష్మీనారాయణ, జయరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న వైసీపీ పతనం ప్రారంభమైందని టీడీపీ పూండి క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చ ఈశ్వరరావు అన్నారు. ఆదివారం పూడి జగన్నాథపురం, పాతటెక్కలి పంచాయతీల్లో పల్లె పల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని తీర్మానించారు. కార్యక్రమంలో నాయకులు కర్ని రమణ, ఎంపీటీసీ సూర్ల చిట్టిబాబు, తిమ్మల కృష్ణారావు, పిరియా శివప్రసాద్, గుర్ల చిన్నారావు, ఆకుల పాపారావు పాల్గొన్నారు.

● **జలుమూరు:** టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు బాగుపడుతుందని క్లస్టర్ ఇన్‌చార్జి కింజరాపు సత్యం అన్నారు. అల్లాడపేటలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సనపల రమణ, దుద్దు రాజేశ్వరరావు, హెచ్.ముకుందరావు, రాంబాబు పాల్గొన్నారు.

● **జలుమూరు (సారవకోట):** రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ అరాచక పాలనకు అంతం పలుకుదామని రాష్ట్ర బీసీ సెల్ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్ అన్నారు. తొగిరి పంచాయతీ తర్లి గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ అరాచకాలను, టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్య క్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు పిళ్లా నందకిషోర్, తాడేల భీమారావు, ఇ.నాగరాజు, గొంటి శంకర్, చెంచలి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

● **నరసన్నపేట:** నరసన్నపేటలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్ర మాన్ని నిర్వహించారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం భ్రష్టుపట్టి పోయిందన్నారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, బోయిన సతీష్, తాలాబత్తుల గోవింద, నేతింటి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **సరుబుజ్జిలి:** టీడీపీ గెలుపులో యువత ముందు ఉండాలని సీనియర్ ఆ పార్టీ నాయకులు తంగి గురయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఆమదాలవలస మున్సిపాలిటీ ఐదో వార్డు పంతులపేట గ్రామంలో టీడీపీ శ్రేణులతో కలిసి బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు యువత పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం రూరల్:** చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు లోపింటి పద్మనాభం అన్నారు. ఆదివారం పాయితారి, కీర్తిపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గిన్ని బాలరాజు, మరళి యువత, మహిళలు పాల్గొన్నారు.

● **జి.సిగడాం:** చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు సాధ్యమని టీడీపీ నాయకులు కుమరాపు రవికుమార్, టంకాల మౌళీశ్వరరావు, జక్కంపూడి దాసు, కుదిరెళ్ల బుజ్జి అన్నారు. ఆదివారం డీఆర్ వలస, దేవరవలస, నిద్దాం, పెనసాం గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పైల రామకృష్ణంనాయుడు, మహదాశ్యం చిన్నారావు, అరెళ్ల గోల్లాజీ, పిల్లల సూర్యారావు, భూపతి శ్రీరామూర్తి, బంగారు నాయుడు, నక్క మురళి తదితరులు పాల్గొన్నారు.

● **పొందూరు:** నందివాడ పంచాయతీ భగవాన్‌దాస్‌పేటలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గాదు నారాయణరావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు విజన్‌ను వివరించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువత పాల్గొన్నారు.



గార: బూరవల్లిలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో..



పొందూరు: బాబు ష్యూరిటీ కార్యక్రమంలో నాయకులు



జి.సిగడాం: దేవరవలసలో..



ఇచ్ఛాపురం రూరల్: కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



సరుబుజ్జిలి: బాబు ష్యూరిటీలో పాల్గొన్న టీడీపీ నాయకులు



ఎల్ఎన్‌పేట: కలమటకి బొట్టు పెడుతూ..



హరిపురం: పల్లెపల్లెకు టీడీపీలో..



జలుమూరు: అల్లాడపేటలో...



సారవకోట మండలం తర్లి గ్రామంలో..



నరసన్నపేటలో..



వజ్రపుకొత్తూరు: మాట్లాడుతున్న ఈశ్వరరావు

ఆధ్యాత్మిక చింతన అవసరం



● పరమపూజ్య భక్త వికాస స్వామి

హిరమండలం: మానవ జన్మను పరిపూర్ణం చేసుకొనే అవకాశం వస్తుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలు కలిగి ఉండాలని పరమపూజ్య భక్త వికాస స్వామి అన్నారు. కిట్టాలపాడు గ్రామం సమీపంలో వైదిక గ్రామమైన కూర్మ గ్రామంలో ఆదివారం హరినామ దీక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. చిత్తశుద్ధితో కృష్ణ నామాన్ని జపం చేయడం ద్వారా ఆధ్యాత్మిక చింతన అలవడుతుందన్నారు. కృష్ణ భక్తితో జీవించడం ఎలా అని ప్రజలకు చూపించేందుకు ప్రకృతి ఒడిలో కూర్మ గ్రామాన్ని నిర్మించడం జరిగిందన్నారు. నగరంలో కూడా కృష్ణ చైతన్యవంతులుగా ఉండవచ్చు గాని అక్కడ అనుకూలమైన వాతావరణం ఉండ దన్నారు. పిల్లలు ప్రయోజకులవ్వాలని తల్లిదండ్రులు కోరుకుంటారని, అయితే సెల్‌ఫోన్ల వల్ల విపరీత ఆకర్షణలకు గురవుతున్నారని, అటువంటి వారు కూర్మ గ్రామంలో చేరితే వీటి నుంచి తప్పించుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. తాను సంవత్సరంలో ఎక్కువ శాతం భారతదేశంలోనే ఉంటున్నానని, ప్రపంచవ్యాప్తంగా గమనించింది ఏమిటంటే నిజమైన ఆధ్యాత్మిక జ్ఞానం పొందాలనే ఆసక్తి ఎక్కువ మందిలో ఉందన్నారు. ఆ దిశగా ఇటువంటి ఆశ్రమాలు మార్గం చూపుతాయన్నారు.

యువత మద్యానికి దూరంగా ఉండాలి

పలాస/కాశీబుగ్గ/ఎల్ఎన్‌పేట/పోలాకి: యువత మద్యానికి, మత్తుకు దూరంగా ఉండాలని వక్తలు అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా పలాస, ఎల్ఎన్‌పేట, పోలాకిల్లో స్థానిక స్వచ్ఛంద సంస్థలు, ఆసుపత్రులు, రాగోలు జెమ్స్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాధిగ్రస్థులు మనోధైర్యంతో ఉంటే వ్యాధిని తగ్గించు కోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు, జెమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.



వివేకానంద విగ్రహం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఐక్యసంఘాల ప్రతినిధులు

భౌతికశాస్త్ర పరీక్షలో విజేతలకు బహుమతులు

నరసన్నపేట: మండల స్థాయి భౌతికశాస్త్ర మేథోత్సవం నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో ఫోరం అధ్యక్షుడు వై.రవికుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఫోరం రాష్ట్ర గౌర వాధ్యక్షుడు సాయి శ్రీనివాస్ పర్యవేక్షణలో వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. విజేతలకు ఎంఈవో శాంతారాం బహుమతులు అందించారు. కార్యక్రమంలో వకులా రత్నమాల, బి.కేశవ రావు, జీవీఆర్ మూర్తి, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు హాజరయ్యారు. ● **జలుమూరు:** విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేందుకు ప్రతిభ పరీక్షలు దోహదం చేస్తాయని ఎంఈవో బి.మాధవరావు అన్నారు. లింగాలవలస ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం మేథోత్సవంలో భాగంగా మండల స్థాయి ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉంగటి అప్పలసూర్యనారాయణ పీఎస్ టీచర్స్ ఫోరం మండల కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు. ● **నందిగాం:** ఫిజికల్ సైన్స్ ఫోరం మేథోత్సవంలో భాగంగా ఆదివారం ప్రతిభా పరీక్షలు నిర్వహించి విజేతలకు ఎంఈవో జి.నర్సింహులు అందించారు. ఎంఈవో-2 ఎ.చిన్నారావు, ప్రతినిధులు బి.మోహనరావు, వై.భుజంగరావు పాల్గొన్నారు.

రైతు రుణాలను రెన్యువల్ చేయించాలి

పోలాకి: సహకార సొసైటీ ద్వారా రైతులు తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో రెన్యువల్ చేయించాలని, లేకుంటే అదనపు వడ్డీ వసూలు చేస్తామని డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, సీఈవో బి.రాంబాబు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. గత ఏడాది మార్చిలో తీసుకున్న రుణాలకు రెన్యువల్ చేయించుకుంటే రైతులకు 7 శాతం వడ్డీ వర్తిస్తుందన్నారు. లేకుం టే 13 శాతం వడ్డీతో అసలు చెల్లించాల్సి వస్తుందన్నారు. రెన్యువల్ చేయించుకునేందుకు రైతు లు భూహక్కు పత్రాలు, వన్‌బీ, రేషన్, ఆధార్ కార్డు, 3 ఫొటోలు, బ్యాంక్ ఖాతాపుస్తకం, ఫోన్ నెంబర్ వివరాలతో సొసైటీలో సంప్రదించాలన్నారు.

సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఆర్‌బీబీఎల్‌తో ఒప్పందం

పర్లాకిమిడి: సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఆర్‌బీబీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు డాక్టర్ డీఎస్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సెంచూరియన్ విశ్వ విద్యాలయం రాష్ట్రీయ వాణిజ్య బ్యాంక్ లిమి టెడ్, నేపాల్‌లో కలిసి పనిచేస్తుం దన్నారు. ఈ మేరకు ఆర్‌బీబీఎల్ ఉద్యోగులతో ఇటీవల ఎంవోయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. సెంచూ రియన్ విశ్వవిద్యాలయం విద్య నైపుణ్యాభివృద్ధిలో ప్రసిద్ధి చెందిందన్నారు. నేపాల్‌లోని ప్రముఖ ఆర్థిక సంస్థలతో ఒకటైన ఈ రాష్ట్రీయ వాణిజ్య బ్యాంక్ లిమిటెడ్ దేశ ఆర్థిక రంగంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అటువంటి సంస్థతో సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఈ ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ డిప్యూటీ కార్యనిర్వాహ ణాధికారి దేబాష్ ప్రసాద్, దుర్గాకుమారి, వినోద్ మాసాని, పద్మలక్ష్మి, వినోద్ ఆత్రేయ, సెంచూరియన్ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ పీకే మహంతి, అనితా పాత్రో, సుప్రియా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌బీబీఎల్ బృందంతో ఒప్పందం కుదుర్చుకున్న సెంచూరియన్ ఉన్నతాధికారులు

ఒడిశా

ఆదివాసీ హక్కుల నిర్వీర్యం వల్లే వెనుకబాటుతనం

● గిరిజనులంతా ఏకతాటిపై నడవాలి

● రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బాబూరావునాయుడు

మెళియాపుట్టి: ఆదివాసీ హక్కులు, చట్టాలు నిర్వీర్యం అయిపోవడం వల్లే గిరిజనుల్లో ఇంకా వెనుకబాటుతనం కనిపిస్తోందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బాబూరావునాయుడు అన్నారు. ఆదివారం మెళియాపుట్టిలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన హక్కులను అందరూ కలిసికట్టుగా పోరాడి కాపాడుకో వాలన్నారు. గిరిజన యువకులు ఉన్నత స్థాయిలో రాణించాలంటే చదువు ముఖ్యమన్నారు. గిరిజ న పిల్లలు చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గోండ్వానా దండ కారణ్య పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మడకం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. శ్రీకాకుళంలో బెంతూఒరియా కులాలను ఎస్టీల్లో చేర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అదే జరిగితే ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు గిరిజనులంతా సిద్ధం కావాలన్నారు. ఇక్కడ ఉన్నవారంతా ఒడ్డి కులాలకు చెందిన వారన్నారు. బోయి, వాల్మీకి కులాలను ఎస్టీల్లో చేర్చేందుకు అసెంబ్లీలో రెండు సార్లు చేసిన తీర్మానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నియోజకవర్గంలో దండకారణ్య పార్టీ పోటీ చేస్తుందన్నారు. గిరిజన బిడ్డలకు రాజకీయ ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. అంతకు ముందు గిరిజన సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. గిరిజన సంఘ నేతల ను అభినందించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయ వాది ఊరి రవి, గిరిజన సంఘ నాయకులు వాబ యోగి, ఎండయ్య, ఆదివాసీ చైతన్య వేదిక అధ్యక్షుడు చొక్కారావు, వరహాల కృష్ణారావు, జగన్, రాంబాబు, కుమార్, దేవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



గిరిజన నాయకులను అభినందిస్తున్న దృశ్యం

పోర్టు పనులను పరిశీలించిన కలెక్టర్

సంతబొమ్మాళి: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, నౌపడలో పోర్టు నిర్వాసితుల పునరావాస కాలనీ పనులను కలెక్టర్ మనజిన్ జిలానీ సమూన్ ఆదివారం పరిశీలించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మూలపేటను సందర్శించి పోర్టు పనుల తీరును పోర్టు మేనేజర్ శంకర్ ను అడిగి తెలుసుకున్నారు. నార్త్ బ్రేక్, సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణం పనులను సముద్రంలోకి వెళ్లి పరిశీలించారు. తీరంలో చేపడుతున్న సివిల్ వర్క్స్, పోర్టు అప్రోచ్ రోడ్డు, పోర్టు డిజనింగ్ మ్యాప్ సహా యంతో పరిశీలించారు. అనంతరం నౌపడలోని పునరావాస కాలనీని సందర్శించారు. ప్లాట్లు గుర్తించి నిర్వాసితులకు అందజేసేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బి, రెవెన్యూ, సర్వే అధికారులతో మాట్లాడి పనుల వివరాలు తెలుసుకున్నారు కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ చంద్రమౌళి, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు. ● **టెక్కలి:** టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ఆదివారం కలెక్టర్ మనజిన్ జిలానీ సమూన్ సందర్శించారు. ఆయనకు సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, సిబ్బంది స్వాగతం పలికారు. కార్యాలయ చాంబర్, ఇటీవల నూతనంగా నిర్మించిన ఆడి టోరియం, లైబ్రరీ భవనాన్ని పరిశీలించారు.



సంతబొమ్మాళి పోర్టు బ్రేక్ వాటర్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

కొవ్వొత్తులతో నిరసన

కాశీబుగ్గ, ఫిబ్రవరి 4: విశాఖ నగరం కొమ్మాదిలో తహసీల్దార్ సనపల రమణయ్య హత్యకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ నాయకుడు దువ్వాడ జీవితేశ్వరరావు, టీడీపీ నాయకుడు వజ్జ బాబూరావు, మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, పూర్ణ చంద్రరావు డిమాండ్ చేశారు. వివిధ పార్టీల నేతలు ఆదివారం గాంధీ విగ్రహం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. రమణయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డి.నాగు, శ్రీధర్, వైకుంఠరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు పట్టుకుని నిరసన తెలుపుతున్న వివిధ పార్టీల నేతలు

తహసీల్దార్ కుటుంబానికి మంత్రి పరామర్శ

నందిగాం: దారుణ హత్యకు గురైన తహసీల్దార్ సనపల రమణయ్య కుటుంబాన్ని మంత్రి సీదిరి అప్పలరాజు పరామర్శించారు. ఈ మేరకు ఆదివారం దిమిలాడ వెళ్లి కుటుంబాన్ని ఓదార్చి పరామర్శించారు. వైసీపీ జిల్లా సమన్వయకర్త పి.తిలక్, పీఏసీఎస్ అధ్యక్షుడు డి.మధు, సర్పంచ్‌లు శ్రీనివాసరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

'తెప్పల'కు లయన్స్ పురస్కారం

పలాసరూరల్: పలాస-కాశీబుగ్గ లయన్స్ క్లబ్ సభ్యుడు, జనజాగృతి సాహితీ సంస్థ గౌరవా ధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తికి ప్రొగ్రెసివ్ మెల్విన్‌జోన్స్ ఫెలో లయన్స్ పురస్కారం లభించింది. ఈ మేరకు విశాఖలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 316 మల్టిపుల్ లయన్స్ జిల్లా ఎల్‌సీ ఐఎఫ్ రికగ్నిషన్‌లో భాగంగా మాజీ లయన్ ఫ్రాంక్ జెమూర్ ఆధ్వర్యంలో తెప్పల కృష్ణమూర్తికి అవార్డు అందించి అభినందించారు.

సర్పంచ్‌కు సన్మానం

నందిగాం: గణతంత్ర వేడుకల్లో ప్రత్యేక ఆహ్వానితురాలిగా హాజరై సత్కారం పొందిన నందిగాం సర్పంచ్ జడ్యాడ రమణమ్మను ఆదివారం సన్మానించారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి ఆధ్వ ర్యంలో స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు దుశ్శాలువా కప్పి సత్కరించారు.

ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం

● మండల సమావేశంలో సభ్యుల ఆవేదన

నందిగాం: మండలంలో ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం జరిగిందని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు ఎం.సంజీవరావు, బి.బాలకృష్ణ, ఎం.సీతారాం తదితరులు మాట్లాడుతూ.. రైతుల సమస్యలను ఎవరూ పట్టించుకోక పోవడం వల్ల రైతులు అన్యాయానికి గురయ్యారన్నారు. ఎంపీపీ కలుగజేసుకొని రైతులకు ఎదురైన ఇబ్బందులపై శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఉపాధి పథకంలో భాగంగా పంచాయతీల్లో నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాల బిల్లులు నేటికీ రాకపోవడంపై పలువురు సభ్యులు ప్రశ్నించారు. దీనిపై ఏపీవో ఎం.నాగరాజు మాట్లాడుతూ. చెత్తసేకరణ బిల్లులకు సంబంధించి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు బదలాయించారని, ఆ కార్పొరేషన్ ద్వారా బిల్లులవుతాయని తెలపగా ఎం.బుక్‌లను ఆర్‌డబ్ల్యూఎస్‌కు అందించి పంచా యతీ ద్వారా బిల్లులు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఈవోపీఆర్డీ టి.రాజారావు, ఉపాధ్యక్షురాలు ఆర్.లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రానైట్ ఆపరేటర్ల సమ్మె

టెక్కలి: గ్రానైట్ క్వారీల్లో ఎక్స్‌కవేటర్ల ఆపరేటర్లుగా స్థానికులకే అవకాశం కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ నాలుగురోజులుగా చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం కూడా కొనసాగింది. టెక్కలి-తెంబూరు రోడ్డు వలేసాగరం సమీపంలో వంటా-వార్పుతో నిరసన తెలిపారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారమ య్యేవరకు సమ్మెను కొనసాగిస్తున్నామని సంఘ ప్రతినిధులు తెలిపారు.

జీవితాలకే గ్యారెంటీ లేని వ్యవస్థలో ఉన్నాం

టెక్కలి: జీతాలకే కాక జీవితాలకే గ్యారెంటీ లేని వ్యవస్థలో ఉన్నామని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి మాజీ కార్యదర్శి గున్న ప్రసాదరావు ఆదివారం ఒక ప్రక టనలో అన్నారు. తహసీల్దార్ సనపల రమణయ్య హత్య అత్యంత కిరాతకమని, ఉద్యోగ బాధ్యతలను నిర్వహించే సమయంలో ఏవరికైనా ఇబ్బంది కలిగితే ఉన్నతాధికారులను సంప్రదించాలి తప్ప భౌతిక దాడులకు పాల్పడడం మూర్ఖత్వమేనని అన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు ఉచిత నేత్రవైద్య శిబిరం

పలాస: స్థానిక సత్యసాయి మందిరంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి పరీక్షలు చేస్తా రని, అవసరమైన వారికి ఆపరేషన్లకు ఎంపిక చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

మంత్ర పఠనంతో ఆరోగ్యం

శ్యామలాపురం(ఎల్.ఎన్.పేట): ప్రతిదినం ఉదయాన్నే గాయత్రీ మంత్రాన్ని పఠిస్తే శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత నెలకొంటుందని సత్యసాయి సంస్థ మండల కన్వీనర్ ఎ.నారాయణరావు అన్నారు. శ్యామలాపురం సత్యసాయిబాబా మందిరంలో ఆదివారం తండులార్చన (బియ్యం), గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవకులు గిరి బాబు, ఢిల్లీశ్వరరావు, చందు, శ్రావ్య, చాందిని, శ్రావణి పాల్గొన్నారు.



ఆటో బోల్తా.. 15 మందికి గాయాలు


బోల్తాపడిన ఆటో, బాధితులకు సాయం అందిస్తున్న శిరీష

హరిపురం: మందస మండలం హరిపురం-బాలిగాం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 15 మంది మహిళలకు గాయాలయ్యాయి.. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సంతబొమ్మాళి మండలం మర్రిపాడుకు చెందిన 15 మంది మహిళలు ఆటోలో కవిటి మండలం బొరివంక లోని ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి ఇంటికి వస్తుండగా బాలిగాం సమీ పంలో అదుపు తప్పి పొలాల్లోకి బోల్తా పడింది. గాయపడిన వారిలో మహిళలతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

సపర్యలు చేసిన శిరీష

అదే సమయంలో పలాస నుంచి సోంపేట వైపు వెళ్తున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష వాహనాన్ని ఆపి బాధితులకు సపర్యలు చేశారు. 108 వాహనానికి ఫోన్ చేసి వారిని హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరికొందరిని తన వాహనంతో పాటు అనుచరుల వాహనాల్లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారిని ఇంటికి పంపినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రకాష్‌వర్మ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మందస ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

న్యాయం చేయాలని కోరితే బెదిరిస్తున్నారు

● వైసీపీ నేతకు అనుకూలంగా పోలీసులు ● బాధితురాలి ఆవేదన


సుజాతతో వాగ్వాదం చేస్తున్న నౌపడ ఏఎస్‌ఐ

సంతబొమ్మాళి: తన ఇంటికి తాళం వేయడంలో కట్టుబట్టలతో ఉన్నామని, వైసీపీ నేత నుంచి న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తే పట్టించుకోలేదని, పైగా బెదిరింపులకు పాల్పడుతున్నారని నీలాపు సుజాత, ఆమె కుమారుడు కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఈనెల ఒకటో తేదీన నీలాపు సుజా త ఇంటికి స్థానిక వైసీపీ నేత దౌర్జన్యంగా తాళం వేసి సామాన్లు బయటకు పడేసిన విషయం తెలిసిందే. ఆదివారం సాయంత్రం బాధితురాలు సుజాత ఇంటి తాళం తీయగా నౌపడ ఏఎస్‌ఐ శ్రీరామ్మూర్తి అక్కడికి వచ్చి ఎందుకు తాళం తెరిచావని, ఇంటి పత్రాలు తీసుకురావాలని హుకుం జారీ చేశారు. దీంతో బాధితురాలు ఆగ్రహం వ్యక్తంచేస్తూ తన ఇంటికి తాళం వేసి, సామాన్లు బయట పడేసిన నేతపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇప్పుడు ఆ వైసీపీ నేతకు వత్తాసు పలుకుతున్నారని ఆమె ఆరోపించింది. వివాదం న్యాయస్థానంలో ఉందని, సివిల్ వ్యవహారంలో ఎందుకు అత్యుత్సాహం చూపిస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ఇంటి పత్రాలు కోర్టులో ఉన్నాయన్నారు. ఇంటి సామగ్రి బయటకు పడేయంతో నగదు, బంగారం పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. నిరుపేద కుటుంబంలో పుట్టడమే తాను చేసిన నేరమా అని ప్రశ్నించింది. దీంతో స్టేషన్‌కు రావాలని చెప్పి ఏఎస్‌ఐ అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ ఘటనపై ఎస్‌ఐ కిశోర్ వర్మను వివరణ కోరగా ఈ సంఘటనపై 100కి కాల్ రావడం వల్ల పోలీసులు అక్కడికి వెళ్లారని, సుజాత పేరుమీద ఉన్న ఇంటిపత్రాలు తీసుకు రావాలని చెప్పామన్నారు.

పేకాట శిబిరంపై దాడి

టెక్కలి రూరల్: అక్కవరం కుమ్మరవీధిలో ఆదివారం సాయంత్రం పేకాట శిబిరంపై టెక్కలి పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.7,340 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ-2 వెంకటేశ్వరరావు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


భాస్కరరావు (ఫైల్)

రణస్థలం: గడ్డి మందు తాగిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జేఆర్‌పురం పోలీసుల వివరాల మేరకు.. వీఎన్‌పురం పంచాయతీ సూరంపేట గ్రామానికి చెందిన జి.భాస్కరరావు(18) అనే యువకుడు గత నెల 15న గ్రామ సమీపంలో ఒక చెరువు వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. భాస్కరరావు సెల్‌ఫోన్ కొనమన్నాడని, దీనికి తాము ఒప్పుకోకపోవడంతో గడ్డి మందు తాగినట్లు తండ్రి నీలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవిందరావు తెలిపారు.

అనారోగ్యంతో సీఆర్పీఎఫ్ జవాన్..


ప్రసాద్ (ఫైల్)

వజ్రపుకొత్తూరు: బెండి పంచాయతీ మహదేవపురం గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ తమ్మినేని ప్రసాద్(38) మృతి చెందారు. ఈయన కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. ఒడిశా రాష్ట్రం రాయగడ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రసాద్ మరణవార్త తెలుసుకున్న సీఆర్పీఎఫ్, రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. చిన్నవయసులోనే ప్రసాద్ మృతి చెందడంతో మహదేవ పురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రసాద్‌కి భార్య, ఒక పాప ఉన్నారు.

అనకాపల్లిలో నరసన్నపేట వాసి..

అనకాపల్లి టౌన్: స్థానిక ఒక లాడ్జిలో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం బొడ్డుపల్లి గ్రామానికి చెందిన శిర్లాపు దుర్గారావు (55 నుంచి 60 ఏళ్లు) ఆదివారం మృతి చెందాడు. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 31వ తేదీన అనకాపల్లిలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన ఒక లాడ్జిలో శిర్లాపు దుర్గారావు రూమ్ తీసుకున్నాడు. రెండు రోజులుగా ఇక్కడే ఉండి భోజనం చేయలేదని, ఇతడు లివర్ ఇబ్బందులతో వైద్యం పొందుతున్నాడని సీఐ శంకరరావు తెలిపారు. రెండు రోజులుగా రూమ్ తలుపులు దగ్గరకు వేసి ఉంచాడని ఆదివారం ఉదయం అపస్మారకస్థితిలో ఉన్న దుర్గారావును రూమ్ బాయ్ చూశాడన్నారు. ఆయన వివరాలు తెలుసుకుని కుటుంబసభ్యులకు సమాచారమివ్వగా వారు వచ్చారన్నారు. భార్య రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ మహ్మద్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారని సీఐ శంకరరావు తెలిపారు. ఈయన మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని, ఎన్టీఆర్ వైద్యాలయంలో వైద్యులు పోస్టుమార్టం చేసిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్టు ఆయన చెప్పారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లారని సీఐ శంకరరావు తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీలు

నరసన్నపేట: నడగాంలోని రామాలయంలో, ఉర్లాంలో గల శ్రీకృష్ణ ఆలయంలో ఒకే రోజు చోరీలు జరిగాయి. శనివారం రాత్రి చోరీలు జరిగిన విషయాన్ని అర్చకులు ఆదివారం ఉదయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో నరసన్నపేట సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐ అశోక్‌బాబుతో కలిసి ఆలయాలకు చేరుకుని పరిశీలించారు. నడగాం రామాలయంలో రెండు కిలోల వెండి, ఉర్లాంలో రూ.15వేల నగదు పోయినట్టు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే రోజున ఆలయాల్లో వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

పీహెచ్‌సీ ప్రారంభం

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామంలో నాడు-నేడు కింద మంజూరైన రూ.164లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం ప్రారంభించారు.


● **కవిటి:** మాణిక్యపురం గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రి భవనాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పి.విజయ ఆదివారం ప్రారంభించారు. కవిటిలోని ఉషోదయ యువజన సంఘం నూతన భవన నిర్మాణానికి కవిటిలో శంకుస్థాపన చేశారు.

క్విజ్ విజేత నెల్లిమర్ల జట్టు

కంచిలి: థెరిస్సా హెల్పింగ్ ఆర్గనైజేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం గోకర్ణపురంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో నెల్లిమర్ల జట్టు మొదటి విజేతగా నిలిచింది. రెండో స్థానంలో రట్టి జట్టు, మూడో స్థానంలో కవిటి చింతామణి జట్టు విజేతగా నిలిచింది. వైద్యులు యారాడి కృష్ణమూర్తి, సర్పంచ్ పాల్గొన్నారు.

ఉద్దానంపై మంచు దుప్పటి

● దట్టంగా కురవడంతో ప్రజలు ఇబ్బందులు


ఇచ్ఛాపురం: మంచులో వాకింగ్ చేస్తున్న యువకులు


కవిటి-ఈదుపురం రోడ్డులో..


సోంపేట: రైల్వే ట్రాక్‌పై..

ఇచ్ఛాపురం/ రూరల్/ కవిటి/ సోంపేట: ఉద్దానాన్ని మంచు దుప్పటి కప్పేసింది. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట మండలాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి దట్టంగా పొగ మంచు కురిసింది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు తొలగలేదు. దీంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఎదురెదురు వాహనాలు కనిపించని పరిస్థితి ఏర్పడింది. లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు. అలాగే రైల్వే ట్రాక్‌ల గుండా మంచు ఉండడంతో రైళ్ల రాకపోకలకు కొంత ఇబ్బంది ఏర్పడింది. మంచుతో జీడి, మామిడి పూత దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


సోంపేట: జాతీయ రహదారిని కప్పేసిన పొగమంచు..


ఇచ్ఛాపురం: పాత బస్టాండ్ జంక్షన్‌లో లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనాలు

టీడీపీలో 80 కుటుంబాల చేరిక


కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

అరసవిల్లి: శ్రీకాకుళం నియోజకవర్గం చాపురం పంచాయతీ నుంచి టీడీపీ సీనియర్ నాయకుడు రెడ్డి చిరంజీవులు ఆధ్వర్యంలో 80 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం వారు మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సమక్షంలో అరసవల్లిలోని వారి స్వగృహంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గుండ దంపతులు వారికి పార్టీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గుండ దంపతులు మాట్లాడుతూ.. వైసీపీ పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీని ఓడించేందుకవువ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జోగారావు, అల్లు రమేష్, అల్లు శ్రీరాములు, మట్ట డిల్లేశ్వరరావు, తిప్పన శ్రీనివాసరావు, అంపోలు శ్యామలరావు, తిప్పన సంతోష్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సీర రమణయ్య, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు చిట్టి మోహన్, టీడీపీ అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు బలగ చెంగలరావు, మాజీ సర్పంచ్ సూరాడ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీకూర్మంలో..


పార్టీలో చేరిన వారితో టీడీపీ నాయకులు గొండు శంకర్ తదితరులు

గార: శ్రీకూర్మం పంచాయతీకి చెందిన వైసీపీ చెందిన 15 కుటుంబాల వారు ఆదివారం టీడీపీ యువనాయకులు ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ సమక్షంలో టీడీపీలో చేరారు. శ్రీకూర్మం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మైగాపు ప్రభాకరరావు, టీడీపీ నాయకులు గిరి ఆధ్వర్యంలో ఆదివారం గారలో జరిగిన కార్యక్రమంలో టీడీపీలో చేరారు. వీరికి గొండు శంకర్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వార్డు మెంబరు వి.అసిరినాయుడు, టీడీపీ నాయకులు బడగల వెంకట అప్పారావు, ఆదినారాయణ, అప్పారావు, రమేష్, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలి

ఆమదాలవలస: సమాజంలో మానవతా విలువలతో జీవించడానికి ప్రతీ ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. ఆదివారం వంజంగి గ్రామంలో మాజీ సర్పంచ్ యండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యండ చిట్టియ్య గణపతి చారిటబుల్ ట్రస్టును ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చారిటబుల్ ట్రస్టులు, సేవా సంస్థలు ఏర్పడడం వల్ల సేవా కార్యక్రమాల ద్వారా గ్రామాలు మరింత అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు కోట గోవిందరావు, విద్యావంతులు, వైద్యులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్నివిధాలా అభివృద్ధి

జి.సిగడాం: బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దేశాన్ని అన్నివిధాలా అభివృద్ధి చెందిందని బీజేపీ మండల అధ్యక్షుడు, విశ్వకర్మ నియోజకవర్గ కోఆర్డినేటర్ వజ్జపర్తి రఘురాం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. నిరుపేదల అభ్యున్నతికి ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా ప్రతీ గ్రామంలో అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, పొగిరి దాశరథి, గట్టెం అప్పలరాజు, మానం పోలారావు, అప్పారావు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సందడిగా గడుపుతున్న పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సురంగి హయ్యర్ సెకండరీ స్కూల్‌లో 1966లో చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలు నడుమ నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంఈవో ఎస్.నారాయణరావు, ఎస్.రామారావు(ఎలక్ట్రికల్), వి.సోమేశ్వరరావు (ఎగ్రికల్చర్), జానికి (బ్యాంక్), కె.వీరేష్ (సైన్టిస్ట్), రామ్‌దాస్(సీఆర్‌పీ), భాస్కరరావు (నేవిల్ డ్యాక్‌యార్డ్) వీరంతా ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు. ఇచ్ఛాపురం, వైజాగ్, ఒడిశా, హైదారాబాద్, బెంగళూర్ తదితర ప్రాంతాల్లో స్థిరపడినవారే.

మందులపై జీఎస్టీ ఎత్తివేయాలి



అరసవల్లి: మందులపై జీఎస్టీని ఎత్తివేయాలని, అత్యవసర మందులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నరవ మహేశ్వరరావు, అధ్యక్షుడు డీవీటీ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు విజయవాడలో జరుగనున్న రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఉపాధ్యక్షుడు ఎల్.శ్రీకాంత్, ఉప కార్యదర్శులు బి.వెంకటరావు, ఎం.శంకరరావు, ప్రసాద్, రాము, గోవింద్, మురళీ, ఇతర కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

ఇది మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ


మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు కళా వెంకటరావు

రణస్థలం: సీఎం జగన్‌రెడ్డి విడిచిపెట్టినది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను వంచించడమేనన్నారు. డీఎస్సీ పేరుతో యువతను మోసం చేయడానికి కొత్త నాటకం తెర తీశారన్నారు. ఇంతవరకూ జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన దాఖలు లేవని విమర్శించారు. ప్రతి టీడీపీ కార్యకర్త సైనికుల్లా పనిచేసి, వైసీపీ ప్రభుత్వం అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో గొర్లె విజయ్‌కుమార్, ముప్పిడి సురేష్, గొర్లె సాయి, పిషని జగన్నాథంనాయుడు, కానకారావు, కొప్పిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపు నిస్తాయి

లావేరు: సమాజంలో పనిచేస్తున్న ఏ స్థాయి ఉద్యోగికైనా.. వారు చేస్తున్న సేవలే గుర్తింపు నిస్తాయని తహసీల్దార్ ఎస్.దిలీప్ చక్రవర్తి అన్నారు. ఆదివారం లావేరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇక్కడి నుంచి బదిలీపై విజయనగరం జిల్లా తెర్లాం మండల తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లిన దిలీప్‌చక్రవర్తికి వీడ్కోలు సభ నిర్వహించి, ఘనంగా సత్కరించారు. కొత్తగా నియమితులైన తహసల్దార్ ఆదిలక్ష్మిని స్వాగతం పలుకుతూ బదిలీపై వెళ్లిన తహసీల్దార్ దిలీప్ చక్రవర్తికి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ మూర్తి, ఎస్ఏ రత్నకుమార్‌తో పాటు పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యం

ఆమదాలవలస: రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని బీజేపీ కన్వీనర్ పేరాడ సూరపునాయుడు అన్నారు. విలేకరులతో ఆదివారం మాట్లాడారు. అవినీతి, రౌడీయిజం రాజ్యమేలుతున్నాయని, మొన్న విశాఖలో సాక్షాత్తూ ప్రభుత్వ అధికారి తహసీల్దార్ సనపల రమణయ్య హత్య దారుణం ప్రజలకు భద్రత లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే ప్రజలు తిరుగుబాటు చేస్తారని, బీజేపీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులు అవుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీతే కీలకపాత్రని సూరపునాయుడు అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చింతాడ అప్పారావు, బొడ్డేపల్లి చిన్నబాబు, సంపతిరావు రామారావు పాల్గొన్నారు.

ఆదిత్యుని ఆదాయం రూ.3.44లక్షలు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.3,44,454 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.90,500, విరాళాల ద్వారా రూ.71,954, ప్రసాదాల ద్వారా రూ.1,82,000 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఆదివారం స్వామివారిని శ్రీకాకుళం నగరానికి చెందిన డాక్టర్ సునీల్ నాయక్, ఎస్.విజయ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.1,00,116, పి.రేవతి, లక్ష్మి దర్శించుకుని ఆలయ అభివృద్ధికి రూ.1,55,000, ఎస్‌వీఎస్ సురేష్ కుమార్ స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి రూ.1 లక్ష ఈవోకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి, పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

అరసవల్లి: ఎన్నికల హామీలను విస్మరించి, దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెట్టే కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. నగరంలో ఆదివారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీలను మోదీ నిలబెట్టుకోలేదని, నలభై కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికుల హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షన్ముఖరావు, పాల పోలారావు, ఉప్పాడ సూర్యనారాయణ, బమ్మిడి వేణు, చిట్టి సింహాచలం, చుక్క రాము, లబ్బ రమణ, బి.రాజు, వై.ప్రసాద్, గణేష్, త్రినాథ్, దుర్గాప్రసాద్, రామచంద్ర, మణి, సోగ్గాడు, ఆర్.గణేష్, అప్పారావు పాల్గొన్నారు.

చేసిన సేవలు నిరుపమానం


పోలీసు అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో పని చేసి బదిలీపై వెళ్తున్న ప్రతీ పోలీసు అధికారి ప్రజలకు పారదర్శకంగా అందించిన సేవలు నిరుపమానమని ఎస్పీ జీఆర్ రాధిక కొనియాడారు. జిల్లాలో పనిచేసి బదిలీపై వెళ్లిన పలువురు పోలీసు అధికారులకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బదిలీపై వెళ్లిన ఏఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు కె.బాలరాజు, ఎస్.వాసుదేవరావు, సీహెచ్ జీవీ ప్రసాద్, సీఐలు ఆదాం, ఈశ్వరప్రసాద్, దాలిబాబు, లక్ష్మణరావు, ఆర్ఐ ఉమామహేశ్వర రావును ఎస్పీ ఘనంగా సత్కరించారు.

సంబరంగా సహస్ర కోలాటం


కోలాటం ఆడుతున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: కళింగ వైశ్య జిల్లా మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో 1000 మంది మహిళలతో కోలాట నృత్యాలు, సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కోలాటం ప్రారంభంలో ఎస్పీ జీఆర్ రాధిక కోలాటం ప్రారంభిస్తూ మహిళలందరూ శక్తి స్వరూపులని, అన్నింట్లో ముందంజలో ఉంటారన్నారు. అనంతరం 12 గంటల నుంచి 20 నిమిషాల పాటు పది భక్తి గీతాలను పాడుతూ, కోలాటం ఆడుతూ నృత్యాలు చేస్తూ అలరించారు. అనంతరం అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు కోఆర్డినేటర్లు రాజేంద్ర గౌడ్, ఊటుకూరు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డును, పత్రాలను కళింగ మహిళా జిల్లా సంఘం అధ్యక్షుడు మళ్లా పద్మజ, లాడే శాంతి ప్రియ, తంగుడు జ్వాలలకు అందచేశారు. కార్యక్రమంలో సూరిబాబు, రమణ, గోవింద రాజులు, జామి భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ధర్మాన మాటలు హాస్యాస్పదం

అరసవల్లి: రెవెన్యూ మంత్రి ధర్మాన మాటల గారడీతో ప్రజలను ఆకట్టుకోవడంలో అందెవేసిన చేయి అని, ఎత్తిపోతల పథకాన్ని ఖరీఫ్ నాటికి పూర్తి చేసి, ఏటా పంటలకు రెండుసార్లు సాగునీరు అందిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఇరిగేషన్ శాఖవారు ఈ ఏడాది ఉపాధి నిధులు కాలువల నిర్మాణం కోసం కాకుండా రోడ్లు వేయడానికి వినియోగించడం వల్లనే వంశధార చివరి ప్రాంతాలకు సాగునీరు అందకపోవడం అందరికీ తెలుసన్నారు. ఒకవేళ మంత్రి ధర్మాన అన్న మాటలే నిజమైతే వచ్చే ఖరీఫ్ నాటికి సాగునీరు అందించడానికి మీ ప్రభుత్వం ఈ 70 రోజుల్లో తీసుకునే చర్యలను రైతులకు వివరించాలని డిమాండ్ చేశారు. అలాగే భూహక్కు చట్టం విషయంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దానిని కప్పిపుచ్చుకునేందుకు ధర్మాన తన వాక్చాతుర్యాన్ని వినియోగిస్తున్నారని, ఇది అందరికీ స్పష్టంగా అర్థమవుతుందన్నారు. అద్వానీకి భారతరత్న రావడం సంతోషంగా ఉందన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

గార: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు గొండు శంకర్ అన్నారు. ఆదివారం ఉదయం గారలో మత్స్యకారులు నాయకులు ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ప్రభుత్వ పాలనలో ప్రజలు విసిగిపోయారని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ అధికారం తథ్యమన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పీస వెంకట రమణ మూర్తి, టీడీపీ నాయకులు బడగల వెంకట అప్పారావు, మైగాపు ప్రభాకరరావు, గిరి కల్లి ఎర్రన్న రెడ్డి ఎండు చిన్నారావు, అమ్మాన్నరావు, ఆదినారాయణ, జగదీష్, టీఎస్ఎస్ ప్రసాద్, బర్రి రామారావు, మైలపిల్లి అప్పారావు పాల్గొన్నారు.

జయహో బీసీని విజయవంత చేయాలి

జి.సిగడాం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవి కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు హాజరు కానున్నట్టు ఆయన తెలిపారు.

ప్రారంభోత్సవానికి ఆహ్వానం

ఆమదాలవలస: పట్టణంలోని వన్‌వే జంక్షన్ వద్ద ఈ నెల 7వ తేదీ బుధవారం ప్రారంభించనున్న ప్రెస్‌క్లబ్ కార్యాలయ ప్రారంభానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్‌ను జర్నలిస్టులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ఆయన్ని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవికుమార్ నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆపోటా నూతన కార్యవర్గం ఎన్నిక

కంచిలి: ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక కంచిలి జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ బరాడో అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎన్నికల అధికారులుగా ఆపోటా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కైలాస్ చంద్రనాయక్, రవినారాయణ చౌదరీ పర్యవేక్షణలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షులుగా బాస్కర్ పాడీ, ఉపాధ్యక్షులుగా రామహరి పాడీ, ప్రధాన కార్యదర్శిగా బృందావన్ దోళై సంయుక్త కార్యదర్శిగా బెసీ కృష్ణమూర్తి, సుదర్శన్ బెహరా, సహాయ కార్యదర్శిగా జయరాం, ఎన్.రవికుమార్, ఆడిటర్‌గా గోవిందరాజ్, సహాయక అడిటర్‌గా పి.లావణ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చిన్నారులకు ఆర్థిక సాయం

పొందూరు: విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు కొండేటి శంకరరావు, ఝాన్సీలను కోల్పోయి అనాథలైన జాడపేటకు (మలకాం) చెందిన చిన్నారులకు మృతుడు శంకరరావు స్నేహితులు రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో ఆదివారం నగదును అందించారు.

తెరవే కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయతల వేదిక ఆధ్వర్యంలో నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో 89వ నెలవారీ కవి సమ్మేళనం అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోమలరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 14 మంది కవులు కవితలు చదివి వినిపించారు. వేదిక ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ రమణ మూర్తి, కవులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

వెటర్నరీ క్రికెట్ లీగ్‌లో సత్తాచాటిన శ్రీకాకుళం జట్టు

రణస్థలం: ఏటా ఏప్రిల్ 4న నిర్వహించనున్న వరల్డ్ వెటర్నరీ డేని పురస్కరించుకుని ఐదు జిల్లాల వెటర్నరీ వైద్యుల క్రికెట్ టోర్నమెంట్‌లో శ్రీకాకుళం జిల్లా చాంపియన్‌గా నిలిచింది. ఈ టోర్నమెంట్ విజయనగరం జిల్లా కందుకూరి క్రికెట్ అకాడమీ, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో ఆదివారం జరిగాయి. ఇప్పటికి వరుసగా శ్రీకాకుళం వెటర్నరీ జట్టు మూడుసార్లు చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్ మ్యాచ్ తూర్పుగోదావరి, శ్రీకాకుళం జట్టుల మధ్య జరిగింది. శ్రీకాకుళం వెటర్నరీ జట్టు గెలుపొందింది. జేడీ వీఆర్‌బీవి చంద్రమౌళీ నాయక్ చేతుల మీదగా బహుమతులు అందుకున్నారు.